
# అబద్ధం!

కప్పగంతుల మల్లికార్జునరావు




సత్యమూర్తి గారిది మాది వొకే వూరు, వొకే వీధి. ఆయన కుటుంబాన్ని గురించి నాకు బాగా తెల్సు. ఆయన భోగట్టా అడగడానికి రమణమూర్తిగారు పొద్దున్నే స్వయంగా మా యింటికి వచ్చాడు.

ఉద్యోగపు బదిలీల్లో భాగంగా యీవూరు చేరిన ఆరు ఏడేళ్ళుగా రమణమూర్తిగారితో గట్టి పరిచయమే యేర్పడింది. ఆయనకు నేనంటే గొప్ప వాత్సల్యం అభిమానం. నేను ప్రచురించిన వో గ్రంథానికి ఆయన కృతి భర్త—నేను కృతి కర్త!

అంచేత మారు ప్రశ్నలు అడగకుండా సత్యమూర్తిగారిని గురించి నాకు తెల్సినదంతా చెప్పేను.

సత్యమూర్తిగారంటే నాకు విపరీతమైన గౌరవం. అంత గౌరవానికి గల కారణం ఆయనలోని బలహీనత! సత్యమూర్తిగారి బలహీనత— చచ్చినా అబద్ధం చెప్పకపోవటం! సత్యసంధుడాయన!

"ఈ రోజుల్లో కూడా యింకా అలాంటి సత్యహరిశ్చంద్రులున్నారంటే నేను నమ్మను. మీరు రచయితలు కదా? ఎగ్జాగరేట్ చేస్తున్నారు!"

రమణరావుగారు అలా అంటారని నాకు తెల్సు. వ్యక్తిగా ఆయన పరమ నైష్ఠికుడు, ధర్మిష్ఠి అయినా, వృత్తి ధర్మంగా ఆయన రోజూ ఎన్నో అబద్ధాలాడుతుంటాడు. ఇతరులచేత ఆడిస్తుంటాడు. సత్యాన్నే నమ్ముకొని వుంటే అంత పెద్ద క్రిమినల్ లాయర్ ఎలా అయి వుండేవాడు?

"మీరు నమ్మితే అసహజంగాని నమ్మకపోవటంలో ఆశ్చర్యమేముంది? కాని సత్యం ప్రపంచంలో యింకా చావలేదనటానికి వుదాహరణగా సత్యమూర్తిగారు. అందుకే ఆయనకు 'వొట్టి అప్రయోజకుడు' అన్న ముద్ర పడింది 'చెట్టు క్రింద ప్లీడరు' అన్న బిరుదు లభించింది. చిన్న చిన్న అబద్ధాలు కూడా ఆడలేక వొక్కగానొక్క ఆడపిల్ల పెళ్ళి చేయలేక అవస్థ పడటం నాకు తెలుసునండీ. నీతి నిజాయితీలకీ, సత్యానికీ బొత్తిగా విలువ లేని కాలం వచ్చింది.ఏమిటో?"

'ఆ పిల్ల పెళ్లి విషయంగానే నాకు ఉత్తరం రాసేరు— ఆ హరిశ్చంద్రుడుగారు. అందుకే..."

నాకు అంతా అర్థమయింది.

అయితే పద్మినికింకా పెళ్లి కాలేదన్న మాట? పాపం!

పద్మిని చాలా చాలా ఏళ్ళ క్రితం నా శిష్యురాలు!

"సత్యమూర్తిగారి సత్యసంధాతను గూర్చి మీరు అంత గొప్పగాచెప్పినా మీ కథ చదువుతున్నట్లు వున్నదేకాని నిజం అనిపించటం లేదు ప్రత్యక్ష ప్రమాణం కావాలి నాకు. ఆయనచేత అబద్ధాలు ఆడించి మీ మాటలు కల్పనలని, అతిశయోక్తులని నిరూపిస్తాము నేను."

'అంటే......?'

'అవసరమైనపుడు మీరు నాతో పెళ్లి చూపులకు రావాలి. అంతే...'

* * *

పోస్ట్‌మేన్ యిచ్చిపోయిన కవరు చించి

వుత్తరం చదువుకొని నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు సత్యమూర్తి.

'ఏమిటండీ? రమణమూర్తిగారివద్ద నుంచేనా ఆ వుత్తరం? ఏం రాసేరో చెప్పకుండా ఆ మౌనవ్రతం ఏమిట్ట?'

'మనం అనుకొన్న ఆయనగారి మేనల్లుడికి యీ మధ్యనే వివాహం అయిపోయిందిట!'

'అయ్యోఖర్మ!అయినా పెళ్ళి అయిపోయిన వాడి సంబంధం ఏ తలకిమాసినవాడు చెప్పేడు మీకు? ఎవరో మిమ్మల్ని ఆటలు పట్టించ టానికి యీ సంబంధం చెప్పి వుంటాడు. ఆఖరికి మన పిల్ల పెళ్ళి వూరూరా వారికి ఏగితాళి ఆట అయిందన్నమాట! అసలు— దానికి వివాహ యోగ్యత వుంటే మీ కడుపున ఎందుకు పుడుతుంది? సత్య హరిశ్చంద్రుడిలా అబద్ధమాడనని భీష్మించుకు కూర్చొని వచ్చిన సంబంధాలని చెడగొట్టుకునే తండ్రి నెక్కడైనా చూచామా అని!'

వర్ధనమ్మ కన్నకడుపు ఆక్రోశం అది. ఆమెకి భర్త అంటే అపరిమితమైన గౌరవం.

సత్యమూర్తి ప్లీడరుగా ప్రాక్టీసు పెట్టిన తొలి రోజుల్లో అబద్ధాలు ఆడలేక తీసుకొన్న కేసులన్నీ వోడిపోతున్న భర్తకు నైతికంగా అండగా నిల్చింది కాని ధనాశతో పన్నెత్తు మాట అనలేదు.

'అబద్ధాలాడి, అన్యాయాలుచేసి ఆర్జించిన ధనం మనకు నిజమైన సుఖ సంతోషాల నివ్వదండీ మీ సత్యసంధతే మన కుటుం బానికి తరగిపోని సంపద.'

నిజానికి సత్యమూర్తి సత్యహరిశ్చంద్రుడిలా, గాంధీగారిలా, అబద్ధాలు ఆడనని ఎవరి ముందూ శపథాలు చెయ్యలేదు. కానీ ఎలా అలవాటయిందో సత్యం చెప్పటం చిన్ననాటి నుంచి అలవాటయింది.

కాలక్రమేణా కుటుంబ బాధ్యతలు నెత్తిన పడి, బ్రతుకు బరువు తెల్సివచ్చాక, ఆయనకు అందరిలాగా అబద్ధాలు ఆడైనా సంపా దించాలన్న కోరిక కలుగకపోలేదు. కానీ దుర్గుణంలాగా సద్గుణమూ వో అలవాటే. అబద్ధం ఆడలేక పోయేవాడు. సమయానికి నిజం చెప్పేసేవాడు.

''సత్యమూర్తిగారూ, మీకు 'లా'లో ఎంత పాండిత్యమున్నదో మాకు తెల్సండి. కానీ తీర్పులు యిచ్చేది ఎవిడెన్సులమీద. సాక్ష్యాలు సృష్టించలేని పాండిత్యం, తెలివితేటలు ఎందుకూ పనికిరావుకదండీ?'' జడ్జీలే

# అ బ ద్ధం

ఆయనకు చెప్పి చూచారు.

కానీ అవన్నీ ఆయనకు తెలియనివి అవుతేగా?

క్రమంగా ఆయన చెట్టుకింద ప్లీడర్ల లిస్టులో చేరిపోయాడు. అయినా సంసారం గడిచిపోయిందంటే పిత్రార్జితం కరిగిపోక తప్పదు కదా?

పిత్రార్జితం కరిగిపోయిననాటికి పద్మిని పెళ్ళికి ఎదిగి వచ్చింది.

పద్మిని అందవిహీనకాదు. అలాగని అతిలోక సౌందర్యవతీ కాదు. ఇంటర్ ఫస్టు క్లాస్‌లో పాసయిందంటే తెలివిగలదానికిందే లెక్కకదా?

'మెడిసిన్ చదువుతాను నాన్నా.'

## చర్య

వడ్డీకి
తెచ్చిన
ధనం
రుణం!
వడ్డీ
అసల్ని
మించిపోతే
దారుణం!!

- కోనేనాగ వెంకట ఆంజనేయులు

చదివించటానికి సత్యమూర్తికి అభ్యం తరంలేదు కానీ ఆర్థికస్థితి? ఆ వూళ్ళో మెడికల్ కాలేజీ లేదు. మరోవూరు పంపించి మెడిసిన్ చదివించటమే?

'నాకు అంత శక్తి లేదమ్మా. లేనిపోని ఆశలు పెట్టుకోకు. కావాలంటే బియస్సీలో చేరు'

పద్మిని బియస్సీలో చేరలేదు. తండ్రికి అదీ బరువేగదా?

'చదువులెందుకండీ ఆడపిల్లలకి! పెళ్ళి సంబంధాలు చూడగూడదూ?'

ఆ ప్రయత్నంలో మొదట్లోనే చుక్క ఎదురయింది.

పద్మిని మూలా నక్షత్రాన దుష్ట లగ్నంలో పుట్టింది.

జాతకాన్ని చూచి చాలామంది వెనక్కి పోయారు.

'జాతకం మార్పించి రాయించండి ఎవరు చూడవచ్చారు?'

అబద్ధం... వంచన...

'పోనీ జాతకాలు లేవంటే సరి!'

'ఉంచుకొని లేదనటం మాత్రం అబద్ధం కాదూ?'

'మా అమ్మాయి మూలా నక్షత్రంలో పుట్టింది.' అడగనివాళ్ళక్కూడా ముందుగానే చెప్పేసేవాడు సత్యమూర్తి.

అందుకు యిష్టపడి కొందరు పెళ్ళి చూపులకొచ్చారు.

'అమ్మాయి ఇంటర్ ఫస్టు క్లాసులో పాసయింది కదా? అంతటితో చదువు ఎందుకు ఆపించారు?'

'చదివించే ఆర్థిక స్తోమత నాకు లేక—'

'మరి చదివించే స్తోమత లేనివాళ్ళు పిల్లకు కట్నం యిచ్చి ఏం పెళ్ళి చేస్తారు? రేపు పెళ్ళయ్యాక అల్లుడికి మర్యాదలేం చేస్తారు?'

మరొకరు—

'మీరు సత్యవ్రతం పట్టేరుకదా? కట్నం కాస్తో కూస్తో యిస్తామంటున్నారు. కానీ కట్నం యివ్వటం, తీసుకోవటం చట్టరీత్యా నేరం. మరి— రేపు ఖర్మకాలి కట్నంయిచ్చారా అని అడుగుతే ఏంచెప్తారు?' వొకాయనకు అనుమానం వచ్చి అడిగేడు

'కట్నం యిచ్చినప్పుడు యివ్వలేదని అబద్ధం ఎలా చెప్పటం?'

ఆ తర్వాత ఆయనతో సంబంధం అంటేనే మొహం అటు తిప్పుకొని పోసాగేరు జనం.

అప్పుడు వర్ధనమ్మ రంగప్రవేశంచేసింది. అటువాళ్ళని యిటువాళ్లని పోగేసి పిల్ల పెళ్ళి ఎలాగైనా జరిపించమని ప్రాధేయ పడింది

కట్నం క్రింద తలాకాస్త వేసుకొని సాయం చేయటానికి అంతా సిద్ధపడ్డారు. కానీ అసలు సంబంధం కుదరద్దూ? కుదరా లంటే అవసరమైతే చిన్న చిన్న అబద్ధాలు ఆడక తప్పుతుందా?

వాళ్ళు లౌక్యంగా అబద్ధాలాడటం— సత్య మూర్తి సత్యం చెప్పటం!

సంబంధాలు వెనక్కి పోయాయి. సాయం చేయ వచ్చిన వాళ్లు నవ్వులపాలయ్యారు.

అప్పటి నుంచి వర్ధనమ్మ కడుపులో భయం... ఆక్రోశం!

'రమణమూర్తిగారికి ఒక కొడుకు

వున్నాడుట. అతనికి వివాహం చేయాలనుకొంటున్నారట!' సత్యమూర్తి మెల్లగా అన్నాడు.

'ఏదీ . ఆ వుత్తరం యిలా యివ్వండి ముందు' వర్ధనమ్మ భర్త చేతుల్లో వుత్తరం లాక్కొని చదివింది

'మీ రసలు మతివున్న మనిషేనా అని! అలా దిగాలుపడి కూర్చున్నారు! మనం అడగకుండానే ఆయనంతట ఆయన తన కొడుకును గురించి యిన్ని వివరాలు రాసేడూ అంటే మన సంబంధానికి వాళ్ళు సుముఖంగా వున్నారని అర్థం కావటంలేదూ ? పైగా వాళ్ళకు జాతకాలు అక్కర్లేదుట !'

'కానీ వాళ్ళబ్బాయి వయసు యిరవై నాలుగు సంవత్సరాలుట ! మనమ్మాయి వయసు...'

''వాళ్ళబ్బాయికి యిరవైనాలుగు సంవత్సరాలైతే మనమ్మాయికి పద్దెనిమిది సంవత్సరాలే. వెయ్యి అబద్ధాలాడైనా వో పెళ్ళి చేయించమన్నారు పెద్దలు. మీరేమో మీ సత్యసంధతతో కన్నకూతురి గొంతు కోస్తున్నారు. యీసారి మీరు నోరెత్తితే నేను గొంతుకు వురిబిగించుకు ఛస్తాను. ఆ వ్యవహారమంతా మా అన్నయ్య, నేను చూచుకొంటాం కానీ మీరు మూగవారిలా నోరు మెదపక కూర్చోండి. తెల్సిందా ?'

* * *

'మీ హరిశ్చంద్రుడు గారినుంచి యివాళ ఉత్తరం వచ్చిందండీ మాస్టరుగారూ'

'మీరేం రాసేరు ? వాళ్ళేం రాసేరు ?'

''ఏంరాస్తేనేంలెండి ? మీరు అంతగా పొగిడిన వ్యక్తిని మనం అంతాకళ్ళే చూడబోతున్నాంగా ? అన్ని విషయాలు పెళ్ళిచూపుల్లో తేలిపోతాయిలెండి. యింతకీ పెళ్ళిచూపులకి ఎప్పుడు వెళ్దామంటారు ?'

'మీ యిష్టం... కానీ నేను ప్రేక్షకుడినే కాని మధ్యవర్తిని మాత్రం కాను గుర్తుంచుకోండి '

'అంటే ఏం మాట్లాడననేగా మీ తాత్పర్యం. నేను కోరేదీ అదేలెండి.'

* * *

సత్యమూర్తిగారు కూడా అందరితో పాటుగా మమ్మల్ని రిసీవ్ చేసుకొన్నారు. కానీ నన్ను చూచికూడా వొక్క మాట మాట్లాడలేదు. మర్యాదలు, పలకరింపులు అన్నీ ఆయన బావమర్దే చూస్తున్నాడు. బావమర్ది పేరు పురుషోత్తంగారు, కాని పరమ లౌక్యుడులా కన్పించాడు.

సత్యమూర్తిగారు, పద్మినితో తప్ప నాకు ఎవరితో పరిచయంలేదు.

పద్మినిని రంగంలోకి ప్రవేశపెట్టేరు. ఇంటర్‌లో నా శిష్యురాలుగా వుండగా ఎలా వుందో యిప్పుడూ అలాగేవుంది. కానీ పరిశీలనగా చూస్తే మొహంలో ముదురుతనపు లక్షణాలు గోచరిస్తాయి.

పురుషోత్తంగారే పిల్ల విద్యాబుద్ధులను గురించి పొగుడుతూ మాట్లాడుతున్నాడు. ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగల రమణమూర్తిగారు మౌనంగా ఆయన చెప్తున్నది వింటున్నాడేకాని ప్రశ్నలు వెయ్యటంలేదు !

'ఏమిటో అన్నయ్యగారూ ! సంప్రదాయాలని పాటించే వంశాలు మనవి. అంచేత చదువులో ఎక్కువస్తున్నా పిల్ల చదువు ఆపించి వివాహ ప్రయత్నాలు చేస్తున్నాం' సత్యమూర్తిగారి భార్య కలుగచేసుకొని అంది.

అంతవరకు మౌనంగా కూర్చున్న సత్యమూర్తిగారు హఠాత్తుగా నా వైపు చూచి భార్యతో అన్నారు—

'మనమ్మాయి తెలివితేటలు గురించి మనం ప్రత్యేకించి చెప్పాలటే. అమ్మాయి మాస్టారుగారి శిష్యురాలు కాదూ? బావగారూ! మా అమ్మాయి తెలివితేటల్నిగురించి మేం చెప్పకొంటె పొగడ్త అవుతుంది. మాస్టారుగారిని అడగండి–కావాలంటే'

నేను మాట్లాడలేదు. కానీ రమణమూర్తిగారు నా వైపు చూచి మొదటిసారిగా వో నవ్వు నవ్వేరు !

ప్రతిపక్షంవారి సాక్షినుంచి వో పాయింటు రాబట్టినపుడు నవ్వే నవ్వు అది ! దాని అర్థం నాకు తెల్సు !

పద్మినికి పద్దెనిమిది సంవత్సరాలని వ్రాసేడు సత్యమూర్తి కానీ ఏడేళ్ళబట్టే నేను యీ వూళ్ళో లేను. కనుక ఏడు సంవత్సరాల క్రితం ఇంటర్‌లో పద్మిని నా శిష్యురాలని అంగీకరిస్తే ఆమె వయస్సు యిప్పుడు పాతికేళ్ళని అంగీకరించినట్లేగా ?

మరికొన్ని మాటలయ్యాయి

'బావగారూ, మీకు గుర్తుందో లేదో ? మా అమ్మాయికి పద్దెనిమిది సంవత్సరాలే' వున్నట్లుండి అన్నాడు సత్యమూర్తిగారు

ఆయన మాటల్ని పట్టించుకోనట్లు కన్పించాడు కాని రమణమూర్తిగారు నా వైపు చూచి నవ్విన రెండో నవ్వులో విజయగర్వం కన్పించింది నాకు. నేను తలవంచు


# ఇది మీకు చాలా ఉపయోగం

మీ నిత్యవ్యవహారాలకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఏదైనా ఆస్తి కొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే, దేనికెవరివద్ద ఎలా వ్రైసెన్సు తీసుకోవాలి, వివిధజాతుల వివాహ, విడాకుల నిబంధనలు, స్త్రీపురుషుల ఆస్తి హక్కులు, ఎవరితోనైనా ప్రమాదం రాబోతే పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి. ప్రభుత్వ ఉచిత ఇండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తు వ్రాసిపంపుకోవాలి, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి వాటి వివిధ నమూనాలు. అనేక చట్టాల వివరాలు ఇలాంటివెన్నో మీకు ఉపయోగపడేలా, తెలిసేలా వ్రాయబడ్డాయి. 300 పేజీల పుస్తకం ధర రూ. 12. పోష్టుఖర్చులదనం. దేశసేవప్రచురణలు, 2. ఇందిరానగరు, వెంగలరావునగరువద్ద, హైదరాబాదు-500890 కు ఉత్తరంవ్రాసి మీ ఉపయోగానికో పుస్తకం వి పి. పోష్టుద్వారా పొందండి

కొన్నాను. సత్యమూర్తిగారు డైరెక్టుగా అబద్ధం ఆడేరు!

టిఫిన్ కాఫీలు అయ్యాయి చర్చ లోకాభి రామాయణంలోకి దిగింది. పురుషోత్తం గారికి లోక విషయాలు చాలా తెల్సు. అయినా రమణమూర్తిగారే చర్చను సినిమాల పైకి మళ్లించాడు.

చర్చ సినిమాల పై జరుగుతుండగా అయాచితంగా, అనవసరంగా, మళ్ళీ అన్నాడు సత్యమూర్తిగారు—

'సినిమా స్టారులు వయసు దాచుకొని అబద్ధాలు చెప్తారుట! కానీ సంసార పక్ష స్త్రీలు కూడా వయసు చెప్పటానికి సిగ్గు పడ్తారండీ కానీ మనలాంటి అవసరం లేదు కదా? మా అమ్మాయి వయసు నిజంగా పద్దెనిమిది సంవత్సరాలే.'

రమణమూర్తిగారు యీ సారి నా వైపు చూడలేదు. నేరుగా సత్యమూర్తిగారి వైపే చూచారు.

'అయ్యా బావగారూ మీరు సత్యసంధులని పేరు. మేము ఆ ప్రసక్తి తేకపోయినా మీ అమ్మాయికి పద్దెనిమిది సంవత్సరాలేనని రెండుమార్లు చెప్పేరు. మేము విన్నాము. మీ ఆతిథ్యానికి కృతజ్ఞతలు. యింటికి వెళ్ళి మళ్లీ వుత్తరం రాస్తాము — ఏ సంగతీ. శెలవ్'

రమణమూర్తిగారు లేచారు. ఆయనతో బాటు మిగతావారు లేచారు. నేను ఆ సమయంలో సత్యమూర్తి గారివైపు చూచాను. మేము ప్రవేశించినప్పటికన్నా యిప్పుడాయన మొహంలో ఏదో కాంతి కన్పిస్తోంది.

పద్మిని వైపు చూచాను. ఆమె కంటి నుంచి వో కన్నీటి బొట్టు రాలటం కళ్లారా చూచి, రమణమూర్తిగారితోపాటు నేను ఎలా పోగలను?

* * *

పెళ్లివాళ్లు వెళ్లిపోగానే యింట్లో వాళ్ళంతా, నేను వున్నానని అయినా గమనించ కుండా సత్యమూర్తిగారి మీదికి విరుచుకు పడ్డారు.

''పిల్లకు పద్దెనిమిదేళ్లని అన్నిసార్లు మిమ్మల్ని ఎవరు చెప్పమన్నారు? నోరు మూసుకు కూర్చోండంటే వినరు కదా? గడపదగ్గరికొచ్చిన 'సంబంధాన్ని' చెడగొట్టేరు. యిలా అవుతే ఆ పిల్లకి పెళ్లి ఎలాఅవుతుంది భగవంతుడా?' వర్ధనమ్మ కడుపు మంట పట్టలేక భర్తను తిట్టింది. ఏడ్చింది.

'చూడండి మాస్టారూ! నిన్నటిదాకా నిజం చెప్పేనని ఆడిపోసుకొంది మీకు తెల్సుగా? యివాళ నేను నిజం చెప్పేనా? పిల్ల వయసు విషయంలో అబద్ధమే చెప్పేను గదా? అబద్ధం చెప్పినా నన్నే అంటోంది ఎందుకండీ నా భార్య? నాకు మాత్రం నా పిల్లకు పెళ్లి కావాలని లేదా? మేస్టారూ. నేనూ నిర్ణయించుకొన్నా, నా పిల్ల పెళ్లి అయేలాగవుతే నేను వొక్కటికాదు — వెయ్యి అబద్ధాలాడుతా. చూచారుగా? వొక్క అబద్ధాన్ని రెండుసార్లు ఎలా చెప్పేనో? వందసార్లు చెప్తే అబద్ధమయినా నిజమవుతుంది హిట్లరో ఎవడో అన్నాడుకదా మాస్టారూ? అయినా ఆ రమణమూర్తిగారు మా సంబంధాన్ని అంగీకరించాడంటారా?

'నాకుతెల్సు—ఆ సంబంధం ముడిపడదని!' కానీ అలా చెప్తే అసలే నిరాశా నిస్పృహలతో నిండివున్న వాతావరణం మరింత అన్యాయంగా తయారవుతుంది. అంచేత అబద్ధాలు చెప్పినా వారికి ధైర్యాన్ని చెప్పటానికి ప్రయత్నించాను. ఊరట కలిగించే ప్రయత్నం చేసేను.

'మీ రెన్ని చెప్పినా యీ పెళ్లి కుదరదండీ. మా బావగారు చేసిన తప్పు అనవసరంగా మాట్లాడటం! ప్రతిసారి నిజం చెప్పి సంబంధాలు చెడగొట్టేరు. యీసారి అబద్ధం చెప్పి ఫలం లేకుండా చేసేరు' పురుషోత్తంగారు అన్నారు. అంటూ హఠాత్తుగా ఆగేరు—

'రండి...రండి...'

వచ్చిన వారు — రమణమూర్తిగారు. వంటరిగావచ్చారు. వచ్చి నేరుగా సత్యమూర్తి గారి వద్దకెళ్లి ఆయన చేతుల్ని పట్టుకొన్నారు.

'బావగారూ మిమ్మల్నిగురించి మాస్టారు గారు ఏమేమో చెప్తే నమ్మలేదు. అందుకే చిన్న నాటకం ఆడి మిమ్మల్ని అబద్ధం ఆడేలా చేసేను కానీ అబద్ధం ఆడీ మీరు అబద్ధాలాడలేరని నిరూపించుకొన్నారు. ప్రపంచంలో మీ లాంటి సత్యసంధులు కొందరైనా వుండబట్టే ధర్మం యీ మాత్రంగానైనా వుంది మీ సత్యసంధతకు సరైన గుర్తింపు లేకపోవటం యీజాతి చేసుకొన్న దురదృష్టం. మీ అమ్మాయిని మా మేనల్లుడికి చేసుకోవటానికి నిర్ణయించుకొన్నాం — మీకు అభ్యంతరం లేకపోతే — మా మేనల్లుడికి పెళ్లయిపోయిందన్న నా అబద్ధాన్ని మీరు మన్నిస్తే—'

ఎవరికీ నోటంట మాట రాలేదు — ఆనందంతో!

'మాస్టారూ మీరే గెలిచారు.'

రమణమూర్తిగారు నా భుజంమీద చెయ్యి వేసి అంటుంటే, నాకు ప్రపంచాన్ని ధర్మం జయించినంత తృప్తి కలిగింది! ★

